లోక్ అదాలత్‌పై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-తాడేపల్లి : కేఎల్ విశ్వ విద్యాలయం లోని న్యాయ కళాశాల విద్యార్థులకు లోక్ అదా లత్‌పైన సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళా శాల అధ్యాపకులు విద్యార్థులను ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు తీసుకెళ్లారు. మెగా లోక్ అదాలత్ ప్రొసీడింగ్స్‌ను పరిశీలించడానికి గాను విజయ వాడ, గుంటూరు జిల్లా కోర్టులకు వెళ్లినట్లు న్యాయకళాశాల విభాగాధి పతి జయసుధ తెలిపారు. ఈ సందర్భంగా అమరావతి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి లోక్ అదాలత్, శాశ్వత లోక్ అదాలత్ ప్రక్రియల మధ్య వ్యత్యాసం వంటి వివిధ ఆచరణాత్మక సందేహాలపై విద్యార్థులకు స్పష్టంగా వివరించారు. విజయవాడ, గుంటూరు కోర్టుల న్యాయమూర్తులందరూ విద్యార్థులకు న్యాయపరమైన ప్రక్రియలు, ప్రత్యామ్నాయ వివాదాల పరిష్కారాలు ప్రక్రియల ఆచరణాత్మక విధా నాల గురించి వివరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులందరూ విద్యార్థులతో సంభాషించారని ఆమె అన్నారు. వృత్తి పట్ల విద్యార్థులకు ఉన్న ఆసక్తిని, క్రమశిక్షణతో కూడిన ప్రవర్తనను న్యాయమూర్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, అధ్యాపకులు డాక్టర్ విజయసుధ, డాక్టర్ శైలజ, ప్రిన్సిపల్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

21న 'ప్రపంచ మాతృభాషా దినోత్సవ' సభ

విశాలాంధ్ర-గుంటూరు వద్యం : జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉదయం 10గంటలకు గుంటూరు రైలుపేటలోని కన్న విద్యా సంస్థలు ప్రాంగణంలో 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ' సభ జరగనున్నట్టు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ సాహితీ వేత్తలు డాక్టర్ పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ సుశీలమ్మ, కన్న విద్యా సంస్థల అధినేత కన్న మాస్టార్‌లు ప్రధాన వక్తలుగా పాల్గొంటారని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్ర వరి 21వ తేదీని 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహిస్తుం టారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 7151 భాషలు కొనసాగుతున్నాయని, ఇందులో 780 మాతృ భాషలుగా ఇండియాలో కొనసాగుతూ సాంస్కృ తిక వైవిధ్యాన్ని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 21వ తేదీన కన్న విద్యా సంస్థల్లో జరుగు 24వ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సభకు మాతృభాషాభిమానులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని లక్ష్మణరెడ్డి కోరారు.

'లౌకికవాదం తెగిన గాలిపటమవుతుంది'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మానవత్వం వద్దు... మతతత్వమే ముద్దు అంటున్న అరాచక మూకల మూలంగా రాజ్యాంగ మౌళిక సూత్రమైన లౌకికవాదం తెగిన గాలిపటమవుతుందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి హితవు పలికారు. ఈ మేరకు స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శివరామిరెడ్డి మాట్లాడుతూ విద్వేష నేరాలను ఉపేక్షిస్తే ఏదో ఒకరోజు అవి మనతలుపు తడతాయన్నారు. ఊరంతా కమ్మేస్తున్న మంటలు తమ దాకా రావనుకోవటం తెలివిమాలిన తనమేనని దుయ్యబట్టారు. నేటి భారతంలో రాజకీయ వ్యాపారానికి మతమే ముడిసరుకవుతుందని, మనమంతా మానవులం... మనదంతా ఒకే కుటుంబం అనే భారతీయ సాంస్కృతిక ఔనత్యం ఛిద్రమవుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలు తమ నిజ జీవిత సమస్యలు గురించి ఆలోచించకుండా చేసేందుకే స్వప్రయోజనాపరులు మతతత్వాన్ని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. వాస్తవాలను కప్పి పుచ్చేందుకు జనాలను భ్రమల్లో ముంచేస్తున్నారని విమర్శించారు.

డాక్టర్ అమూల్యకు గోల్డ్ మెడల్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మైసూర్ జేఎస్ఎస్ మెడికల్ కళాశాల నుంచి న్యూరాలజీ స్పెషాలటీలో గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా స్థానిక గుంటూరువారి తోటలోని ఆదిత్య హాస్పిటల్స్‌లో ఆదిత్య హాస్పిటల్స్ అధినేత, ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ పాకనాటి కృష్ణప్రవంత్, స్టాఫ్‌మెంబర్స్ డాక్టర్ అమూల్యను సోమవారం ఘనంగా సత్కరించి అభినందించారు. సత్కారం అనంతరం డాక్టర్ అమూల్య మాట్లాడుతూ ఎంతో కష్టమైన న్యూరాలజీ విభాగం నుంచి మైసూర్ జేఎస్ఎస్ మెడికల్ కళాశాల వారు గోల్డ్ మెడల్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఆదిత్య హాస్పిటల్‌లో న్యూరాలజీతో పాటు అన్ని విభాగాలలో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తారని, ఈ అవకాశాన్ని నగర ప్రజలు, చుట్టు పక్క ప్రాంతాల ప్రజలకు కూడా సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కృష్ణ ప్రవంత్, డాక్టర్ అమూల్యలు వెల్లడించారు. పలువురు వైద్యులు పఫిట్స్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వయసుతో నిమిత్తం లేకుండా ఎవరైనా ఫిట్స్‌కి గురయ్యే అవకాశాలు ఉంటాయ న్నారు. సకాలంలో వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవడం ద్వారా ఫిట్స్ నుంచి త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు.

తోపుడు బండి అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి : కుంచనపల్లి గ్రామంలో చిరు వ్యాపారి కొలంటి ప్రేమవర్ధనరావు (కూరగాయలు, ఆకుకూరలు వ్యాపారం) జీవనోపాధి నిమిత్తం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పంపించిన తోపుడు బండిని కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు అందజేశారు. తనకు జీవనోపాధి నిమిత్తం తోపుడు బండి అందజేసిన నారా లోకేష్‌కు కొలంటి ప్రేమవర్ధనరావు కృతజ్ఞతలు తెలిపారు. తోపు డు బండిని అందజేసిన వారిలో తాడేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అమరా సుబ్బారావు, కుంచనపల్లి గ్రామ ప్రధాన కార్యదర్శి బిరుదుగడ్డ రమేష్, తాడేపల్లి మండల తెలుగు రైతు కార్యదర్శి శేషంశెట్టి శ్రీనివాసరావు, మంగళగిరి నియోజకవర్గం క్రిస్టియన్ సెల్ కార్యదర్శి కోలంటి మాణిక్యాలరావు, మంగళగిరి నియోజకవర్గ తెలుగు రైతు కార్యదర్శి కొలంటి మహేశ్వరరావు, తాడేపల్లి మండల క్రిస్టియన్ సెల్ కార్యనిర్వాహణ కార్యదర్శి కుక్కమళ్ల వేలంగిని, కొమ్మోజి కృష్ణబాబు, కాజా భరత్, కాలే ప్రసాద్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన 'శ్రీకృష్ణ జననం-కంసవధ' యక్షగానం

విశాలాంధ్ర-గుంటూరు : విశ్వనాథ సాహిత్య అకా డమీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే యక్షగాన మహోత్సవాలలో భాగంగా మంగళవారం బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై తమిళనాడు మేలటూరు భాగవతమేళ నాట్య నాటక సంఘం ఆధ్వర్యంలో 'శ్రీకృష్ణ జననం-కంసవదం' యక్షగానం ప్రేక్షకు లను భక్తి పారవశ్యంలో ఓల లాడించింది. శ్రీకృష్ణుడిగా విజయ్ మాధ వన్, కంసుడిగా ఎస్.కుమార్, వసు దేవుడిగా ఆర్.అరవింద్, దేవకిగా శ్రీకాంత్ నటరాజన్, యశోదగా ప్రసన్న ఆయా పాత్రలలో జీవించారు. నాట్యాచార్యులు ఎస్.కుమార్‌ను విద్యా సుందరి బెంగళూరు నాగరత్నమ్మ స్మారక పురస్కారంతో సత్కరించారు. దేవస్థానం పాలక మండలి అధ్యక్షులు చిటిపోతు మస్తానయ్య, విశ్వనాథ సాహిత్య అకాడమీ చైర్మన్ మద్దినేని సింహ కౌటిల్య చౌదరి, కార్యదర్శి మోదుగుల రవికృష్ణ, కన్వీనర్ సెట్లం చంద్రమోహన్ పాల్గొన్నారు.

అర్జీలు నిర్ణీత గడువులోపు పరిష్కరించాలి: కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రజలు సమర్పించిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించకుండా బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళితే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఆర్వో చంద్ర శేఖర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామి రెడ్డి ప్రజల నుంచి 137 అర్జీలను స్వీకరిం చారు. కోర్టు కేసుల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపించే అధికారులపై చర్యలు తీసుకుంటాన్నారు.

జాబ్ మేళా ప్రచార గోడ పత్రికలు అవిష్కరణ

ఏ.పి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్తంగా ఈ నెల 16వ తేదిన తాడికొండ నియోజకవర్గం మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించనున్న జాబ్ మేళాకు సంబంధించి ప్రచార నిమిత్తం రూపొందించిన గోడపత్రికలను సోమవారం కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్‌తో కలసి ఆవిష్కరించారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనపు సమాచారం కొరకు మనిదీప్ 8074607278ను సంప్రదించవచ్చున్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల ప్రచార పోస్టర్లను ఆవిష్కరణ

భారత రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. మన రక్షణకు మంచి ఆర్థిక ప్రవర్తన ఇతివృత్తంతో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు ఫిబ్రవరి 13నుండి 17 వరకు జరుగుతాయన్నారు. వారోత్సవాలు సందర్భంగా ప్రత్యేక శిబిరాల ద్వారా ప్రజలకు ఆర్థిక సేవలపై అవగాహన పెంపొందిస్తారన్నారు.

లంక భూములు ఐదేళ్లు లీజుకు ఇవ్వాలి..

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో కృష్ణానది పరివాహక ప్రాంతంలో లంక భూములు సాగు చేసుకుంటున్న వారికి రెవెన్యూ శాఖ జారీ చేసిన జీవో నెం 799 30-12-2022 ప్రకారం భూములను ఐదు సంవత్సరాలు లీజుకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన జరిగిన జిల్లా స్థాయి కమిటీ అమోదించింది. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ హాలులో కృష్ణానది పరివాహక ప్రాంతంలో సాగులో ఉన్న లంక భూముల లీజు పొడిగింపుపై కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో సంయుక్త కలెక్టర్ రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, కృష్ణానది రిజర్వ్ కన్జర్వేటీవ్ ఈఈ కృష్ణారావు, కొల్లిపర తహశీల్దారు నాంచారయ్య పాల్గొన్నారు. జిల్లాలో కొల్లిపర మండలంలో బొమ్మువానిపాలెం, అన్నవరం గ్రామ పరిధిలో కృష్ణానది పరివాహక ప్రాంతంలోని లంక భూములు, వాటిని సాగు చేస్తున్న వారి వివరాలు, వరదనీటి ప్రవాహం వలన లంక భూములకు ఉత్పన్నమయ్యే సమస్యలు, భూముల క్లాసిఫికేషన్ తదితర వివరాలను కలెక్టర్‌కు రెవెన్యూ అధికారులు, కృష్ణానది రిజర్వు కన్జర్వేటివ్ అధికారులు మ్యాప్‌ల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొల్లిపర మండలంలోని బొమ్మువానిపాలెంలో 182.56 ఎకరాలను 228 మంది, అన్నవరం గ్రామంలో 65.32 ఎకరాలను 182 మంది సాగు చేసుకుంటున్నట్లు గుర్తించారన్నారు. లంక భూములు సాగు చేసుకుంటున్న లబ్ధిదారులకు ఐదేళ్లకు లీజు పట్టా ఇవ్వాలని రెవెన్యూ శాఖ జీవో జారీ చేసిందన్నారు.

చిరుధాన్యాలే మానవాళి ఆరోగ్యానికి ఔషధాలు: ఖాదర్‌వలి

విశాలాంధ్ర-గుంటూరు : చిరుధాన్యాలను ప్రపంచ మానవాళి ఆహారంగా తీసుకున్నట్లయితే... అనేక రకాల ఆరోగ్య సమస్యలకు అవి ఔషధాలుగా పని చేస్తాయని ఫుడ్ అండ్ హెల్త్ ఇండిపెండెంట్ సైంటిస్ట్ డాక్టర్ ఖాదర్ వలి అన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ అండ్ హార్టికల్చరల్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో 'హెల్త్ బెనిఫిట్స్ ఆఫ్ మిల్లెట్స్' అనే అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఖాదర్‌వలి మాట్లాడుతూ మానవాళి సంప్రదాయ ఆహార అలవాట్లను పాటిస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తవన్నారు. తీసుకునే ఆహారాన్ని ఔషధంగా భావించాలన్నారు. చిరుధాన్యాలను ముఖ్య ఆహారంగా తీసుకుంటే ఏవిధమైన వ్యాధి బారిన పడే అవకాశం ఉండదన్నారు. చిరుధాన్యాల వలన అన్ని పోషక విలువలు, లవణాలు, తక్కువ మోతాదులో ప్రోటీన్లు ఉంటాయన్నారు. ఇప్పటి నుంచి చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే కేవలం 3 నెలలో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునన్నారు. సంప్రదాయ పద్ధతులు, జీవవన శైలి పద్ధతులు పాటిస్తే కీళ్లనొప్పులు, నడుము నొప్పులు, మెడ, భుజము నొప్పుల నుంచి పూర్తిగా ఉపశమనం పొందవచ్చునన్నారు. రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రాచీన ఆచార వ్యవహారాలను మన తర్వాత తరం వాళ్లకు అందజేయాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. మంచి ఆహారాన్ని తీసుకుని ఎవరైతే వ్యాయామం కూడా చేస్తారో వారు ఎక్కువ రోగనిరోధక శక్తి కలిగి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణం, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్.రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో అంకుర సంస్థల రూపకల్పనపై సమీక్ష

విశాలాంధ్ర-మంగళగిరి : ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సోమ వారం అంకుర సంస్థల రూపకల్పనపై నిపుణులతో కూడిన స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోరా కమిటీ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో అనిల్ తెంటు కీలక విషయాలపై పలు సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అంకుర సంస్థల ఏర్పాటుకు అవసరమైన అంశాలు, టెక్నాలజీ వినిమయంపై మాట్లాడారు. అంకుర సంస్థల ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడానికి ఎటువంటి ప్రణాళికలు తయారు చేయాలో చర్చించారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ హెచ్ ల్యాబ్ రీసెర్చ్ సెంటర్ సీఈవో డాక్టర్ ఉదయన్ బక్షి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ హెడ్ పురుషోత్తమ్ కౌశిక్, సీఐఐ నార్త్ ఇండియా ఛైర్మన్ డాక్టర్ దినేష్ దువా, ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ యతీంద్రనాథ్ సింగ్, ప్రొఫెసర్ దీపక్ పండిట్(బీఎంఎల్ వర్సిటీ) తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా సరైన టెక్నాలజీతో నూతన అంకుర సంస్థల ఏర్పాటుకు కృషి చేయాలని నిర్ణయించారు.

లూథరన్ చర్చికి కొమ్మారెడ్డి కిరణ్ విరాళం

విశాలాంధ్ర-తాడేపల్లి : చిర్రావూరు గ్రామంలోని లూథరన్ చర్చి 3వ వార్షికోత్సవం సందర్భంగా టీడీపీ తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్(నాని) తమ వంతుగా దేవాలయనికి రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మారెడ్డి బసవేశ్వరువు, గుండిమెడ గ్రామ టీడీపీ ప్రధాన కార్యదర్శి నామతోటి రాంబాబు, చిర్రావూరి గ్రామ అధ్యక్షులు విరిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహితపై అత్యాచార యత్నం

విశాలాంధ్ర-తాడికొండ : పత్తి చేలో ఒంటరిగా పత్తి తీసుకుంటున్న వివాహితపై అత్యాచారయత్నం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం బేజాత్‌పురం గ్రామానికి చెందిన ఓ మహిళ పొలంలో పత్తి తీసుకుంటుంది. పొన్నెకల్లు గ్రామానికి చెందిన ఓ యువకుడు ఒంటరిగా ఉన్న మహిళ వద్దకు వెళ్లి ఆమెపై అత్యాచార యత్నానికి పడిగట్టాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆ యువకుడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. యువకుడిని పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. విచారణ చేపడుతున్నట్లు ఎస్సై నాగార్జున సోమవారం తెలిపారు.

ఘనంగా మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-దుగ్గిరాల : సరోజినీ నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన దుగ్గిరాల గ్రామంలో దుగ్గిరాల మండల ప్రజాపరిషత్ కార్యాలయం నందు మహిళా దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజినీ నాయుడు చిత్రపటానికి పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు దానబోయిన సంతోష రూపావాణి, జడ్పీటీసీ మెంబర్ మేకతోటి అరుణ, గ్రామ సర్పంచ్ బాణావత్ కృషిబాయిలను శాలువా, జ్ఞాపిక, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాడిబోయిన రామస్వామి యాదవ్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నల్ల నూకల వెంకటేశ్వరరావు, కుర్ర నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వధార్ గృహ పథకం నిధులు విడుదల చేయాలి: ఎంపీ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్వధార్ గృహ పథకం నిధులను వెంటనే విడుదల చేయాలని గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ సోమవారం లోకసభలో పార్లమెంట్ ప్రశ్నో త్తరాల సమయంలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గుంటూరులోని కొత్తపేట మహిళా మండలి 2007 నుండి మహిళా స్వయం సహాయక బృందం పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అనేక మంది బాధిత మహిళలకు ప్రయోజనం చేకూర్చిందన్నారు. సకాలంలో నివేదికలు సమర్పించినప్పటికీ రూ.86,15,000లు పెండింగ్‌లో ఉందన్నారు. సంబంధిత అధికారుల ద్వారా సంస్థకు తిరిగి ధృవీకరించడానికి చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని అభ్యర్థించారు. తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉన్న మహిళా మండలి సజావుగా పనిచేయడానికి మద్దతు ఇవ్వలేకపోతున్నారని, పెండింగ్ ఉన్న చెల్లింపులను పూర్తి చేయాలని, సంస్థకు పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని మహిళా, శిశు అభివృద్ధి మంత్రిని కోరారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో స్పందన నిర్వహించారు. కమిషనర్ తొలుత గతవారం స్పందన ఫిర్యాదుల పరిష్కారం, స్పందన పోర్టల్, ఈ.ఆర్.పి., వాట్స్ అప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో, సంబందిత కార్యదర్శులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుండి అందే ఫిర్యాదుల పరిష్కారం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోనే పరిష్కరించాలన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 42 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాలకల్పన చంద్రబాబుకే సాధ్యం

విశాలాంధ్ర-యద్దనపూడి : టీడీపీ బలోపేతానికి యువత ముందుకు రావాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. చింతపల్లిపాడుకు చెందిన యువత సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువత అన్ని రంగాల్లో రాణించాలని, కంపెనీలు పక్క రాష్ట్రాలకు తరలివెళ్లిపో వడంతో యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోవడం జరుగుతుందని అన్నారు. ఉద్యోగ అవకాశాలు రావాలన్న, రాష్ట్రానికి కొత్త కంపెనీలు తీసుకురావాలన్న అది ఒక్క చంద్రబాబు నాయుడుకే సాధ్యమని పేర్కొన్నారు. ఏ నాగాంజనేయులు, ఎం వెంకట్ సాయి, రావుల భవాని శంకర్, వెంకటకృష్ణ చైతన్య, జంపని గోపి, తేజ పాల్గొన్నారు.

రైల్వే హామీలన్నీ నెరవేర్చాలి: ఎంపీ

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్ర రాష్ట్రాన్ని విభజించే సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని గత 9 ఏళ్లుగా డిమాండ్ చేస్తూనే ఉన్నాం.. హామీలను నెర వేర్చకుండా కేంద్రం తాత్సారం చేస్తూనే ఉందని పార్ల మెంట్‌లో కేంద్రాన్ని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు నిలదీశారు. రైల్వే విషయంలో కేంద్రం ఇచ్చిన హామీల్లో.. సౌత్‌కోస్ట్ రైల్వే జోన్ నిర్మించలేదు, కనీసం ఒక్క బిల్డింగ్ కట్టిన పరిస్థితి లేదని అన్నారు. ఏపీ యువత ఉద్యోగాల ఎంపిక కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.. కేంద్రం ఇచ్చిన హామీ మేరకు వైజాగ్‌లో రైల్వే రెక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త రైల్వే లైన్ల నిర్మాణ ఒప్పందాలు 2014కి ముందే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంతో చేసుకుంది.. కానీ అభివృద్ధి గురించి ప్రశ్నిస్తే నిర్మాణాలకు రాష్ట్రం స్థలాలు కేటాయించలేదని సాకులు చెబుతున్నారన్నారు. స్థలం ఇచ్చి అన్ని ఒప్పందాలు రాష్ట్రం పూర్తి చేసుకుంది. కానీ నిధుల విషయంలో రాష్ట్రం ఇబ్బందిపడుతోంది. 2014కి ముందు రాష్ట్ర ఆదాయం బాగా ఉండేది.. విభజన తర్వాత రాష్ట్రంలో రెవెన్యూలోటు ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ఒప్పందాలు సడలించి రాష్ట్రానికి అదనపు నిధులు కేటాయించాలన్నారు. రైల్వే వ్యవస్థను కేంద్రం బిజినెస్‌గా కాకుండా.. సర్వీస్‌గా చూడాలని సూచించారు. కొవిడ్‌కు ముందు చాలా స్టేషన్‌లో రైళ్లు ఆగేవి.. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు. ఉదాహరణకు పల్నాడు జిల్లాలో పిడుగురాళ్ల విషయానికొస్తే.. గతంలో 17 రైళ్లు ఆగేవి, ఇప్పుడు 7 రైళు ఆగుతున్నాయి. ప్రజలు చాలా ఇబ్బంది పడుతు న్నారు. అన్ని స్టేషన్లలో రైళ్లు అగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

హోదా, విభజన హామీలపై ప్రజలకు వివరణ ఇవ్వాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' ద్వారా ప్రజల వద్దకు వెళుతున్న వైసీపీ నాయకులు, ముఖ్యంగా సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్ట్ అలసత్వంపై ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్పీసీ)పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధించి తెస్తామని రాష్ట్ర ప్రజలను నమ్మించి అధికారాన్ని పొందిన చంద్రబాబు గెలిచిన అనంతరం ప్రత్యేక ప్యాకేజీ అన్నందుకు ఆంధ్రులు చిత్తుచిత్తుగా ఓడించిన సంగతి తెలియజేశారు. ప్రధాని నరేంద్రమోడీ ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేస్తున్నాడని తెలిసి చంద్రబాబు కేంద్రంలోని బీజేపీకి భజన చేయటం ఆంధ్రులను మోసగించటం కాదా? అని ప్రశ్నించారు. లోకేష్ పాదయాత్రలో తన హయాంలో ఏపీకి జరిగిన ఘోర నష్టంపై ప్రజలకు ఏమని స్పష్టత ఇవ్వగలరని ప్రశ్నించారు. అదేవిధంగా విభజన అనంతరం ప్రజలు మీకిచ్చిన అధికారాన్ని రాజకీయ కాలక్షేపంతో రాష్ట్ర అభివృద్ధిని నష్టపరిచారని ధ్వజమెత్తారు. అధికారం ఉన్నప్పుడు ప్రత్యేక హోదా, విభన హామీలకు ద్రోహం చేసి ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని మోడీ రాజకీయ అవసరాలకు తాకట్టు పెట్టారన్నారు. అధికారం పోయిన తరువాత పాదయాత్రల ద్వారా ప్రజలను మరోసారి నమ్మించాలనుకోవటం చంద్రబాబు వంటి అనుభవజ్ఞులకు తగదని ఆయన హితవు పలికారు.

విశాలాంధ్ర
గుంటూరు జిల్లా

ప్రజానాట్యమండలి క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-తెనాలి : ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర మహాసభ సందర్భంలో తెనాలి రామలింగయ్య కవి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నూతన సంవ త్సర(2023) క్యాలెండర్‌ను అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి సుఖదేవ్ సింగ్ సిర్సా ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచ లయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆరేటి రామారావు, గుంటూరు జిల్లా ప్రజా నాట్యమండలి అధ్యక్షులు బుల్లిముంత కృష్ణ ప్రసాద్, కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంపు: ముస్తఫా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వైసీపీ ప్రభుత్వంలో పాఠశాలలను అభివృద్ధి చేయటం, మౌళిక వసతులను కల్పించటంతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాభోధన ఉండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా తెలిపారు. సోమవారం 56వ డివిజన్ నెహ్రూ నగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా అక్కడి ప్రజలను ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. నెహ్రూనగర్ 7వ లైనులో ఉన్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పాఠశాలలో వసతులను అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో అందిస్తున్న రేషన్ వాహనాన్ని పరిశీలించి బియ్యం, నిత్యావసర వస్తువుల వివ రాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గా శ్రీనివాస్, కార్పొరేటర్లు యాట్ల రవి, పాపతోటి అంబేద్కర్, వైసీపీ నాయకులు నారకట్ల శ్రీనివాసరావు, తాళ్చూరి సురేష్, అబ్దుల్ సలాం, ఉమా మహేశ్వరరావు, హుస్సేన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి

విశాలాంధ్ర-గుంటూరు : రద్దు చేసిన 26 ఎస్సీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాటిబండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు డాక్టర్ దారా అంబేద్కర్ ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదురు నిరసన దీక్ష చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సీల పట్ల జగన్‌మోహన్ రెడ్డి అవలంబిస్తున్న నిరంకుశ వైఖరిని విడనాడాలన్నారు. వారిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని ఇదేవిధంగా కొనసాగిస్తే వచ్చే ఎన్నికలలో ఎస్సీ వర్గాల తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, మాగంటి సుధాకర్ యాదవ్, కొర్రపాటి సురేష్, రాయపూడి ఏసుబాబు, బోరుగడ్డ బుల్లిబాబు, కుమార్ గౌడ్, రాచుమల్లు భాస్కర్, అప్పిశెట్టి రంగా, రాయ నాగేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, తానుచింతల అనిల్, ఉయ్యాల శ్యాం వరప్రసాద్, మైలా హరికృష్ణ, అనుమోలు ఏడుకొండలు, సుగుణ, కరుణశ్రీ, రేణుక, సరోజిని, ఏలూరి లక్ష్మి, రమాదేవి, పద్మనాభం, ఆవుల రాము తదితరులు పాల్గొన్నారు.

వెండి తెర కళాతపస్వి కె.విశ్వనాథ్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వెండి తెర కళాతపస్వి కె.విశ్వనాథ్ అని ప్రముఖ గాయకులు డీటీ సాయిబాబు అన్నారు. అలాగే తెలుగు సినీ ప్రపంచంలో ప్రతి ఒక్కరి హృదయాలను అలరించిన దర్శక దిగ్గజం కె.విశ్వనాథ్ అని ప్రశంసించారు. సోమవారం స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో పలువురు గాయనీ, గాయకులు, కళాకారులు, దర్శకులు కె.విశ్వనాథ్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ స్వయంకృషితో చిన్నస్థాయి నుంచి దర్శక దిగ్గజంగా ఎదిగిన కళాతపస్వి కె.విశ్వనాథ్ అని కొనియాడారు. జాతీయ స్థాయిలో తెలుగు సినిమాకు ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చి అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సంస్కృతీ సాంప్రదాయాలకు విశ్వనాథ్ పెద్దపీట వేశారన్నారు. ప్రముఖ రచయిత పీవీ రామ్‌కుమార్ మాట్లాడుతూ తొలితరం దర్శకుల ధోరణులను మార్చి తెలుగు సినిమాను మరోదారి మళ్లించడమే కాకుండా ఇంకో మెట్టు ఎక్కించారని కొనియాడారు. తొలుత విశ్వనాథ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. ఈ కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, ప్రముఖ వాస్తు సిద్ధాంతి తల్లం శ్రీనివాసరెడ్డి, రవిచంద్ర, రాజశేఖర్, పింగళి భాగ్యలక్ష్మి, లావణ్య, శివరామయ్య, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

జగనాసుర రక్త చరిత్ర పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి మహిళలపై దాడులు ఎక్కువైపోయాయని, రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని సోమవారం జిల్లా టీడీపీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా టీడీపీ కార్యాలయంలో శ్రావణ్ కుమార్ అధ్యక్షతన తాడికొండ నియోజకవర్గం నుండి వివిధ కమిటీలలో ఉన్న మహిళలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జగనాసుర రక్త చరిత్ర పోస్టర్‌ని మహిళలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమ్ మంత్రిగా మహిళ ఉన్నప్పటికీ మహిళల మీద జరిగే అరాచకాలు నియంత్రించడంలో చేతకానితనం బయటపడిందన్నారు. మెలకువ వచ్చినప్పుడే మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్పందిస్తారన్నారు. ఆమె చైర్‌పర్సన్‌గా మహిళలకు ఉన్నారో... మృగాళ్లకు ఉన్నారో సమాధానం చెప్పాలన్నారు. తెలుగుదేశం పార్టీని మళ్ళీ అధికారంలోకి తేవడానికి మహిళలందరూ కృషి చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో ఇత్తడి రత్నకుమారి, షేక్ జానీబేగం, షేక్ రిజ్వానా, మైనేని గిరిజ, పేరం సుజాత, బండ్లమూడి ప్రియాంక, పెరికల అన్నమ్మ, కంచర్ల శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్తేరు రాణిది వైసీపీ ప్రభుత్వ హత్యే

విశాలాంధ్ర-గుంటూరు : సాక్షాత్తు ముఖ్యమంత్రి నివాసానికి కూతవేటు దూరంలో అంధురాలైన ఎస్తేరు రాణి అనే అమ్మాయిని రాజు అనే యువకుడు గంజాయి మత్తులో దారుణంగా నరికి హత్య చేయటం ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని, గంజాయి వంటి మాదకద్రవ్యాలను అరికట్టలేని ప్రభుత్వమే రాణి హత్యకు పూర్తి బాధ్యత వహించాలని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. సోమవారం తాడేపల్లిలోని సీఎం నివాస ప్రాంతానికి దగ్గరలో అదీ జాతీయ మహిళా దినోత్సవం రోజు ఈ హత్య జరగటం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అసలు రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ ఉందా... లా అండ్ అర్డర్ పనిచేస్తుందా... అన్న అనుమానం కలుగుతోందన్నారు. గంజాయి, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలకు రాష్ట్రాన్ని అడ్డాగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రాణి లాంటి మరో అమ్మాయిని కోల్పోకుండా వైసీపీ ప్రభుత్వం గంజాయి, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. హత్యకు పాల్పడి పరారీలో ఉన్న హంతకుడు రాజుని వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని కోరారు.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

హిమాలయ గురూజీ భిక్షాటన

విశాలాంధ్ర-వినుకొండ: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పూజ్యశ్రీ హిమాలయ గురూజీ దివ్య ఆశీస్సులతో వినుకొండ శాంతి ఆశ్రమం ట్రస్ట్ వారి ఆధ్వ ర్యంలో వితంరాజు పల్లి సాయి బృందావనం (చిన్న షిరిడి) వద్ద గురూజీ ఆశీస్సులతో తలపెట్టిన మహా రుద్రహోమం మృత్యుంజయ హోమం కార్యక్రమంలో భాగంగా హిమాలయ గురూజీ భిక్షాటన నిర్వహించారు. యక్కల శ్రీరామచంద్రమూర్తి, ప్రవీణ్ కుమార్ దంపతులు చేతులతో స్వామికి జోలెలో భిక్షం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ మహాశివ రాత్రికి నిర్వహిస్తున్న సామూహిక రుద్ర హోమం ఈ మహోత్సవంలో సర్వలోక కళ్యాణార్థమై జరపబడుతున్నాయని రైతులు, వ్యాపారులు, కార్మికులు ప్రజలం దరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని భూగర్భ జలాలు పెరిగి ప్రకృతి పచ్చదనంతో పరవశించాలని చేయుచున్నాము కావున భక్తజన సమూహం ఈ మహోత్సవాల్లో పాల్గొని ధన వస్తు సేవల రూపములలో సహాయ సహకారాలు అందించి ఆ పార్వతీ పరమేశ్వరుల కరుణాకటాక్షాలు పొందాలని కోరారు.

కేజీబీవీ పాఠశాలను పరిశీలించిన జీడీసీవో

విశాలాంధ్ర-కారంపూడి: స్థానిక కేజీబీవీ పాఠశాలను గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి రేవతి సోమవారం పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థినులతో బాత్రూం క్లీనింగ్ అనే వార్తకు స్పందించిన ఆమె పాఠశాలను సందర్శించినట్లు తెలిపారు. విద్యార్థినులతో ఆమె ముఖాముఖి మాట్లాడారు. బాలికలు తమ సమస్యల గురించి ఆమెకు వివరించారు. పాఠశాలలో పరిస్థితులను పరిశీలించిన ఆమె విద్యార్థినులకు, ఉపాధ్యాయులకు సూచనలు అందించారు. బాత్రూంలను ఎలా వినియోగించాలో బాలికలకు అవగాహన కల్పించారు.

కోటప్పకొండకు వచ్చే వాహనాలు ఫిట్‌నెస్‌తో ఉండాలి

విశాలాంధ్ర-నరసరావు పేట : మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ ఉత్సవాలకు ప్రయాణికులను చేరవేసే వాహనాలకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ ఉండేలా చూసుకోవాలని వాహన యజమానులను, డ్రైవర్లను జిల్లా ట్రాన్స్‌పోర్ట్(రవాణా శాఖ) అధికారి టి.కె.పరందామ రెడ్డి సూచించారు. స్థానిక డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో వాహన డ్రైవర్లు, యజమానులతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని అవసరమైన ఫిట్‌నెస్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, పర్మిట్, టాక్స్, పొల్యూషన్ సర్టిఫికట్స్ ఫోర్స్‌లో ఉండేలా చూసుకోవాలని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని అన్నారు. పరిమితికి మించి అధిక సంఖ్యలో ప్రయాణికులను తీసుకెళ్లడం ప్రమాదకరమని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం వలన ట్రాఫిక్ జామ్‌కి అవకాశం ఉందని, డ్రైవర్లు క్రమ పద్ధతిని పాటిస్తూ ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని కోరారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ బి.సత్యనారాయణ ప్రసాద్, ఎస్.శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నవోదయం కార్యక్రమం

విశాలాంధ్ర-నరసరావుపేట : స్థానిక మున్సిపల్ అతిథి భవనంలో మంగళవారం 'నవోదయం' డే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నవోదయం నిర్వహణ కన్వీనర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబుల్ నాయుడు తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 'నవోదయం' కార్యక్రమం జరుగుతుందని, ఈ అవకాశాన్ని జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, వ్యాపారాలు చేసుకోవాలని అనుకుంటున్న వారు ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, బ్యాంకర్లు హాజరవుతున్నట్లు నవోదయం కన్వీనర్ ఓబుల్ నాయుడు వెల్లడించారు.

దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు అన్నదానం

విశాలాంధ్ర-మాచర్ల : శుభకార్యాలకు వృద్ధులు, మానసిక వికలాంగులకు అన్నదానం నిర్వహించడం అభినందనీయమని మాచర్ల ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ తురకా దినేష్ అన్నారు. యూఎస్ఏలో నివాసముంటున్న కృష్ణ ప్రసాద్ మనువడు పిన్నమనేని రియాన్ శేఖర్ జన్మదినం పురస్కరించుకొని వైద్యశాలలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దినేష్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స కోసం వచ్చిన రోగులకు అన్నదానం నిర్వహించడం సంతోషకరమన్నారు. ఎక్కడో అమెరికాలో నివాసం ఉంటూ, ఆయన కుటుంబంలో ఏ శుభకార్యం జరిగిన తాను పుట్టి పెరిగిన ఊరిని మర్చిపోకుండా ప్రభుత్వ వైద్యశాల, సూర్య కిరణ్ దివ్యాంగుల పాఠశాల, వివేకానంద అనాథాశ్రమంలో విద్యార్థులకు, యాచకులకు ఏటా ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతి, మెట్టు గోవింద రెడ్డి, కృష్ణ ప్రసాద్ స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : స్వచ్ఛ భారత్ కార్మికులను వెట్టిచాకిరి నుంచి విముక్తి చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారికి జీతాలు సక్రమంగా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామీణ ప్రాంత పారిశుధ్య కార్మికుల గ్రీన్ అంబాసిడర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం వినుకొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఏఐటీయూసీ వినుకొండ మండల నాయకులు భూదాల సాగర్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో పారిశుధ్య కార్మికులు పాల్గొని ప్రభుత్వ మొండి వైఖరి పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బోదాల సాగర్‌బాబు మాట్లాడుతూ పరిశుద్ధ కార్మికుల పట్ల ప్రభుత్వ ద్వంద వైఖరి విడనాడాలని, పని చేసే గ్రీన్ అంబాసిడర్స్‌కు నెలకు రూ.10వేలు జీతం పెంచుతూ జీవో నెంబర్ 680ని ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ ఆచరణలో నేటి వరకు ఆ జీవో అమలు కాకపోవడం విచారకరమన్నారు. కనీసం ఇప్పుడు ఇస్తున్న రూ.6వేలు కూడా గత రెండేళ్లుగా నిలిపివేసి కేవలం వెట్టి చాకిరి చేయించుకోవడం ద్వారా కార్మికుల రక్తం పిలుస్తూ అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. దీంతో పూట గడవక కార్మిక కుటుంబాలు అప్పులుపాలయి అవస్థలుపడాల్సి వస్తుందని సాగర్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి జీతాలు మంజూరు చేయాలని ప్రభుత్వం చెప్పినప్పటికీ అధికారులు కానీ సర్పంచులు గాని పట్టించుకోకుండా కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే ఇవ్వాలని, జీవో నెంబర్ 680 అనుసరించి ప్రతినెల రూ.10వేలు జీతం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల పారిశుధ్య కార్మికులు మహేష్‌రెడ్డి బోయిన అబ్రహం, గాలయ్య, వెంకటేష్, ఏఐవైఎఫ్ నాయకులు కుంచాల అఖిల్, వెంకట రామాంజి, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి పి.శశి కుమార్ కార్తీక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహ సముదాయంలో వసతులు మెరుగుపర్చాలి: సీపీఐ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : టిడ్కో గృహ సముదాయంలో మౌలిక వసతులు మెరుగు పరచాలని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామ సుబ్బాయమ్మ కోరారు. ఈ మేరకు సోమవారం సీపీఐ నాయకులు, లబ్ధిదారులతో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావును కలసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావుతో సీపీఐ నాయకుల బృందం టిడ్కో గృహాలను సందర్శించారు. పలువురు లబ్ధిదారులు టిడ్కో గృహసముదాయంలో తాము పడుతున్న కష్టాలను, సమస్యలను వారి దృష్టికి తెచ్చిన విషయం విదితమే. ఈ సందర్భంగా సుబ్బాయమ్మ మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయంలో పార్కు కోసం కేటాయించిన స్థలంలో కంప పెరిగి, పాములు వస్తున్నాయని, వెంటనే కంపను తొలగించి పార్కును అభివృద్ధి చేయాలన్నారు. ఇళ్లల్లో పైపు లైన్లకు లీకులు ఏర్పడ్డాయని, శానిటరీ పైపులకు లీకేజీలు వున్నాయని వాటిని సరిచేయాలన్నారు. ఇళ్ల కోసం డిపాజిట్ చేసిన వారికి జాబితాలో పేర్లు లేవని చెబుతున్నారని, వారికి ఇళ్లను కేటాయించాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి వస్తున్న తాగునీరు దుర్వాసన వస్తుందని, అన్ని సెంటర్లలో తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న పలువురికి వయో పరిమితి మినహాయించాలి, అలా కాని పక్షంలో వారి వారసులకు ఇళ్లను కేటాయించాలన్నారు. జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలను మెరుగు పర్చారని, రోడ్డు వేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. తాగునీటి బోర్లు ఏర్పాటు చేయాలని, లబ్ధిదారులకు రూ.5 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ గోవిందరావు సానుకూలంగా స్పందించారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, సీపీఐ పట్టణ కార్యదర్శి పేలూరి రమారావు, మహిళా సమైఖ్య పట్టణ కార్యదర్శి బి.లలితకుమారి, బొంతా భగత్‌సింగ్, నాయుడు శివ, బి.నాగేంద్రమ్మ, టి.నరసమ్మపాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర-శావల్యాపురం : పారిశుధ్య కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు కొప్పరపు మల్లిఖార్జునరావు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వ ర్యంలో కార్మికులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమ వారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పారిశుధ్య కార్మికుల పట్ల పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, నెలనెల వేతనాలు అందక వారు ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నారని, నిత్యం పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికుల సమస్యల పరిష్కారంపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న జీవోలు సైతం అమలుకు నోచుకోని దుస్థితి నెలకొందని, ప్రభుత్వాల లాఠీ దెబ్బలకు వెరవకుండా పోరాడి సాధించుకున్న జీవోలను అధికారులు కాగితాల్లోనే మగ్గబెడుతున్నారని వాటిని అమలు చేయకుండా పైశాచిక ఆనందం పొందుతున్నారని పేర్కొన్నారు. 14 నెలల నుంచి వేతనాలు లేక పారిశుధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పనిచేయించుకొని జీతాలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం మీనామేషాలు లెక్కించడం తగదని అన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులకు వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో చెత్తను తొలగించడం, మురికి కాలువలు శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, సచివాలయాల దగ్గర శుభ్రం చేయడం, గ్రామాల్లో అధికారులకు అందుబాటులో ఉంటూ ప్రజలకు నిత్యం సేవ చేస్తున్న పారిశుధ్య కార్మికులపై ప్రభుత్వం చిన్న చూపు చూపడం తగదన్నారు. పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, బట్టలు, సబ్బులు, చెప్పులు, చీపుర్లు, బ్లౌజులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం అక్టోబర్‌లో రూ.10 వేలు వేతనం జీవో నెంబర్ 680 ప్రభుత్వం ఇచ్చినా నేటికీ అమలు కాలేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను స్వచ్ఛభారత్ కార్మికులకు అమలు చేయాలన్నారు. అలాగే ఈ నెల 15వ తేదీన అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు, ఎంపీలకు వినతిపత్రాలు అందజేస్తామని, 20వ తేదీన కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడ్తామన్నారు. పారిశుధ్య కార్మికుల మండల అధ్యక్షులు మల్లాపరపు గురుస్వామి, కార్యదర్శి ఇస్తేల దయామణి, కార్మికులు లక్ష్మయ్య, రాఘవమ్మ, రూతమ్మ, సుందరరావు, ప్రభుదాసు, చెన్ని, కోటేశ్వరరావులతో కలసి కొప్పరపు మల్లిఖార్జునరావు ఎంపీడీవో పేరుమీన శీతారామయ్యలకు వినతిపత్రాన్ని అందజేశారు.

ఈపూరు : మండలంలోని పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఏఐటీయూసీ వినుకొండ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, ఏఐటీయూసీ మండల నాయకులు ఊట్ల రామారావు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులతో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ 13 నెలలకు పైగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని వారి కుటుంబాలు గడవడం కష్టంగా ఉందన్నారు. గ్రామపంచాయతీ నిధులలో పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం జీవో విడుదల చేసిన అమలు కావడం లేదని పేర్కొన్నారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన నవరత్నాలలో ఒక రత్నం కూడా పారిశుధ్య కార్మికులకు అందలేదని అన్నారు. కనీసం కార్మికులు అందరికీ పక్కా స్థలం ఇల్లు ఇవ్వలేదని, యూనిఫాం, రక్షణ పరికరాలు, పనిముట్లు, సకాలంలో కార్మికులకు ఇవ్వడం లేదని అన్నారు. పారిశుధ్య కార్మికులకు నేటికి హెల్త్ అలవెన్స్ అమలు కాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శన మని ఫలితంగా ప్రతి కార్మికుడు ఈ కాలంలో రూ.1.60 లక్షలు నష్టపోయారన్నారు. తక్షణం కార్మికులకు రూ.15 వేలు వేతనం, హెల్త్ అలవెన్స్ రూ.6 వేలు అమలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని ఎంపీడీవో కార్యాలయంలో సూపరిండెంట్ రవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మల్లేశ్వరరావు, సుధాకర్, కొప్పెరపు మల్లికార్జున, నంబూరి దానయ్య, వంగల వీరయ్య, చుండు పేరయ్య, నరసయ్య, రామాంజనేయులు, బందెల కోటేశ్వరమ్మ, బందెల రూతమ్మ, బందెల నాగమ్మ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

బొల్లాపల్లి : గ్రామీణ ప్రాంతాలలో గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికుల గ్రీన్ అంబాసిడర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం బొల్లాపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ బొల్లాపల్లి మండల కార్యదర్శి పిన్నెబోయిన వెంక టేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ పక్షపాత ధోరణికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పిన్నిబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ వారి పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడటం సమంజసం కాదన్నారు. పట్టణ ప్రాంతాల్లో రూ.21 వేలను చెల్లిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో కేవలం రూ.6 వేలు మాత్రమే జీతాలుగా ఇవ్వడం ప్రభుత్వ పక్షపాత ధోరణికి నిదర్శనం అన్నారు. పారిశుధ్య కార్మికులను ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్బంధ పని చేయించడం పట్ల పిన్నిబోయిన వెంకటేశ్వర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.10 వేలు జీతం చెల్లించాలని ఇప్పటివరకు ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున రావు, ఇర్మియా, ఎం.వెంకయ్య, దావీదు, కె.చందారావు, మాదాసు శరభయ్య, జి.రాజు, ఎం.నరసింహారావు, బి.ఆదాము, డి.నరసయ్య, సత్రినా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ: స్వచ్ఛభారత్ కార్మి కులు జగనన్న క్లబ్బుమిత్రకు గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎండీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అనంతరం సూపర్నెంట్‌కి ఏఐటీయూసీ వినుకొండ మండల నాయకులు బూదాల సాగర్ బాబు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుదాల మాట్లాడుతూ కొన్ని నెలలుగా జీతాలు రాక అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్మికులు ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు వీధులు కాలువలు శుభ్రం చేయడమే కాకుండా, అనేక రకాల పనులకు ఉపయోగిస్తున్నారు. వారికి జీతాలు 15వ ఆర్థిక సంఘం నిధులనుంచి వాడుకోవాలని తర్వాత సర్దుబాటు చేస్తామని తెలియజేసినా అధికారులు, సర్పంచులు అమలు చేయడం లేదన్నారు. సర్పంచులను జీతాలు అడిగితే పనులు మానుకోమని బెదిరిస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం వారు కలగజేసుకొని కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే ఇవ్వాలని అదేవిధంగా రెండు సంవత్సరాల క్రిందట రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో పనిచేసే గ్రీన్ అంబాసిడర్స్ కి 6000 నుండి పదివేల రూపాయలు జీతం పెంచుతూ జీవో నెంబర్ 680ని విడుదల చేశారని, కానీ జీవో నెంబర్ 680 ఇప్పటికీ అమలుకి నోచుకోలేదని అన్నారు. కార్మికులకు పని భద్రత కల్పించి పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించి ప్రతినెల జీతాలు ఇవ్వాలని మాస్కులు, బ్లౌజులు, శానిటైజర్లు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పరిశుద్ధ్య కార్మికులు మల్లవరపు మహేష్ రెడ్డి, బోయిన అబ్రహం, గాలయ్య, వెంకటేష్, ఏఐవైఎఫ్ నాయకులు కుంచాల అఖిల్, వెంకట్, రామంజి, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి పులిపాటి శశికుమార్, కార్తీక్ సాయి తదితరులు పాల్గొన్నారు.

నూజెండ్ల : స్వచ్ఛభారత్ కార్మికులు నెలల తరబడిగా వేతనాలు అందక దుర్భర జీవితాలను గడుపుతున్నారని మండల ఏఐటీయూసీ నాయకులు ఎ.పవన్ కుమార్ డిమాండ్ చేశారు. స్వచ్ఛభారత్ కార్మికుల(ఏఐటీయూసీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నూజెండ్ల మండలంలోని ఎండీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణకి కార్మికుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని రూ.6 వేలు వేతనంతో దుర్భరమైన పరిస్థితుల్లో తమ జీవితాలను వెళ్లదీస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీసం ప్రతినెలకొకసారి వేతనాన్ని చెల్లించకుండా ఆరు మాసాలు, సంవత్సరం దాటినా వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమని ఆయన అన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులను నియమించినప్పుడు 660 జీవో ప్రకారం కనీసం రూ.10 వేలు వేతనం ఇవ్వాలని జీవో విడుదల చేసి కూడా వారికి ఆ వేతనాన్ని అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ అధికారులకు అందుబాటులో ఉంటూ ప్రజలకు నిత్యం సేవ చేస్తున్న వీరిపై రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు అడిగితే ఉద్యోగం నుంచి తీసేస్తామని బెదిరించడం అన్యాయమన్నారు. కార్మికుల కుటుంబాలకు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, బట్టలు, సబ్బులు, చెప్పులు, చీపుర్లు, బ్లౌజులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే స్వచ్ఛభారత్ పారిశుధ్య కార్మికుల సంఘం పిలుపుమేరకు మండల ఆఫీసుల వద్ద వినతిపత్రాలు ఇచ్చారని తరువాత స్థానిక శాసనసభ్యులకు, జిల్లా కలెక్టర్లకు కూడా 660 జీవోను అమలు చేసి స్వచ్ఛభారత్ పారిశుధ్య కార్మికులకు రూ.10 వేల వేతనం అమలు చేసేవరకు కార్మికుల నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.జీవరత్నం, మాతంగి రూబేను, పందుల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులు

విశాలాంధ్ర- మార్కాపురం టౌన్ : పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో నివసిస్తున్న మండ్ల పకీరయ్య కుటుంబానికి సోమవారం హోంగార్డు చెన్నుపల్లి కాశయ్య ఆధ్వర్యంలో కాసుల ప్రవీణ్ కుమార్ ఆర్థిక సహకారంతో బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందజేశారు. పక్షవాతంతో బాధపడు తున్న పకీరయ్య దాత ప్రవీణ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. తమ కుమారునికి సాయమందిస్తే చదువు కొనసాగిస్తానని పకీరయ్య భార్య వెంకటమ్మ విజ్ఞప్తి చేశారు. వివరాలకు 9603580633 సంప్రదించాలని హోంగార్డు కోరారు.

తండ్రిని కోల్పోయిన చిన్నారులను ఆదుకుంటాం

విశాలాంధ్ర-పెదకూరపాడు : స్థానిక ఆనందపేటకు చెందిన తాళ్లూరి రమేష్ హార్ట్ ఎటాక్‌తో చనిపోవడంతో ఆయన కుటుంబం రోడ్డున పడింది. ఈ విషయం తెలుసుకున్న సొసైటీ మాజీ ప్రెసిడెంట్ నెలకుదిటి వరప్రసాద్ (బుజ్జి)రమేష్ కుటుంబాన్ని పరామర్శించి చిన్నారులకు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల విద్య నిమిత్తం నెలకుదిటి చిలకాయమ్మ, వెంకట్రావు ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యను అందిస్తామన్నారు. అనంతరం రమేష్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అశ్రునయనాలతో శ్రీ గిరి యెహోయా కిన్ అంతిమ వీడ్కోలు

పలువురు ప్రముఖుల నివాళి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ఏఎంజీ, వేద, ఫార్ కార్నర్స్ సంస్థల వ్యవస్థాపకులు దివంగత డాక్టర్ జాన్ డేవిడ్ మూడవ అల్లుడు, వేద సంస్థల డైరెక్టర్ శ్రీగిరి యెహోవా కిన్‌కు సోమవారం అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. గత బుధవారం రాత్రి ఆయన తీవ్రమైన గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. ఆయన భౌతికాయాన్ని ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి చిలకలూరిపేటలోని గుండయ్య తోటలో గల డాక్టర్ జాన్ డేవిడ్ ఇంటికి తీసుకువచ్చారు. ఇంటి ప్రాంగణంలో గల నిరీక్షణ ప్రార్థన మందిరంలో కుటుంబ సభ్యులు డాక్టర్ అరుణ్ కుమార్ కంటి మహంతి, జేస్సీ, ఎస్.బర్నాబాస్, డాక్టర్ జోన తన్ జాక్, గుమ్మడి శరత్ జోసెఫ్, కేజియా మహంతి, హక్స కళ్యాణి, డాక్టర్ హన్నా మమత యెహోయాకిన్ సతీమణి పెర్సి స్వరూపలతోపాటు పెద్దసంఖ్యలో తరలివచ్చిన బంధువులు, ఆయా సంస్థల సిబ్బంది ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన భౌతికాయాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై పోలిరెడ్డి పాలెంలో ఉన్న వేద పాఠశాలకు తీసుకువెళ్లారు. అక్కడ నుంచి జాతీయ రహదారి పక్కన ఉన్న శ్మశాన వాటికలో ప్రత్యేక ప్రార్థనల మధ్య సమాధి కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా భౌతికాయానికి నివాళులర్పించిన వారిలో మంత్రి విడుదల రజిని, మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ దంపతులు, మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ రఫాని, జీడీసీసీబీ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్లు తేళ్ల సుబ్బారావు, విడదల లక్ష్మీనారాయణ, అసిస్ సంస్థ డైరెక్టర్ జాస్టి రంగారావు, సీఆర్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు చుండి విజయ సారథి, గోరంట్ల పున్నయ్య చౌదరి, వైసీపీ నాయకులు విడదల గోపి, పలువురు ప్రముఖులు ఎం.రాధాకృష్ణ, ఎం.భాను ప్రసాద్, ఆదినారాయణ రెడ్డి, అంజిబాబు, డాక్టర్ లావు సతీష్, రంగారావు, ఎన్.క్రిస్టల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కోటప్పకొండ తిరునాళ్ళ విజయవంతం చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్: కోటప్ప కొండ తిరునాళ్ళ రాష్ట్ర పండుగను అత్యంత రమణీయంగా, ఆహ్లాదకరమైన వాతావర ణంలో కన్నుల పండువగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆదేశించారు. సోమవారం డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ స్పందన హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. గత తిరునాళ్ళలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గ్రామీణ ప్రాంతాల నుంచి తరలి వచ్చే భక్తులకు, వాహనాలకు, ప్రభల రాక పోకలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కోటప్ప కొండ తిరునాళ్ళ రాష్ట్ర పండుగగా గుర్తించి తొలిసారి నిర్వహిస్తున్న వేడుకలకు సంబంధించి జిల్లాలో ఎక్కువగా క్వారీలు, గ్రానైట్ పరిశ్ర మలు ఉన్న ప్రాంతాల్లో రహదారులు పక్కన పెద్ద సంఖ్యలో నిరుప యోగంగా ఉన్న రాళ్ళను వెంటనే వెంటనే వెనుక్కకు జరపాలని ఆదేశిం చారు. క్వారీలు, గ్రానైట్ పరిశ్రమలు వ్యాపార లావాదేవీలను ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్వహించుకోవాలని సూచించారు. దీనిపై జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరక్టర్ సత్యనారాయణ, రవాణా శాఖ జిల్లా అధికారి పనందామయ్య, డీఎస్పీ రవిచంద్రలు కోటప్పకొండ తిరునా ళ్ళకు సంబంధించి వ్యాపారులు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన క్వారీ, గ్రానైట్ పరిశ్రమల నిర్వాహకులు, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-యడ్ల పాడు : పరీక్ష పర్వ 4లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు సోమవారం పాఠశాలలో పరీక్షల ఒత్తిడిని ఎదుర్కోవడం, బాలికల సమస్యలు-పరి ష్కార విధానాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌సీపీసీఆర్, ఎస్సీపీసీఆర్, ఎన్‌సీఈఆర్టీల సౌజన్యంతో బోయపాలెంలోని డైట్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త పర్యవేక్షణలో విద్యార్థులకు పరీక్షల వత్తిడిని ఎదుర్కోవడంపై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో మందుకు తీసుకెళ్తున్నామన్నారు. డైట్ కళాశాల సైకాలజీ లెక్చరర్ వి.శ్రీనివాసరెడ్డి పలు సూచనలు అందించారు. ఎస్సీపీసీఆర్ సభ్యులు బత్తుల పద్మావతి బాలల హక్కులపై విశ్లేషించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జి.శాంతకుమారి, యడ్లపాడు మండల విద్యాశాఖాధికారి అబ్బరాజు శ్రీనివాసరావు, కాంప్లెక్స్ చైర్మన్ శంకర్ రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.శివపార్వతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు భరత్ కుమార్‌కు సాహితీ పురస్కారం

విశాలాంధ్ర-చిలకలూరిపేట : చిలకలూరిపేట ప్రాంత ప్రజలకు సుపరిచితుడు, కవి, రచయిత అద్దేపల్లి భరత్ కుమార్ తెలుగు యూనివర్సిటీ వారి సాహితీ పురస్కారం బుధవారం అందుకోనున్నారు. వృత్తి రీత్యా ఏపీఎస్ ఆర్టీసీ చిలకలూరిపేటలో 25 సంవత్సరాలు పనిచేసి వివిధ హోదాల్లో బాపట్ల, హైదరాబాద్‌లలో విధులు నిర్వహించి డిప్యూటీ సూపరింటెండెంట్‌గా 2017 ఫిబ్రవరిలో పదవీ విరమణ చేశారు. ప్రవృత్తి రీత్యా సాహిత్యం పట్ల అభిరుచి కలిగివుండటంతో 1980 సంవత్సరం నుంచి అనేక కథలు, కవితలు అవి అన్నీ ప్రముఖ పత్రికల్లో ప్రచురించబడ్డాయి. అనేక హాస్య నాటికలను రాయగా అవి ఆకాశవాణిలో ప్రసారం అయ్యాయి. అద్దేపల్లి ఇంతవరకు 5 పుస్తకాలు ప్రచురించారు. అవి చైతన్య జ్యోతి, చెట్టు మాట్లాడింది, చమక్కులు (ఇటీవల 2023లో) ఇవి కవితా సంపుటాలు కాగా, కాకి సందేశం, నవ్వించే నాటికలు ఇవి నాటికల సంపుటులు. ఈ నవ్వించే నాటికలు పుస్తకానికే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాదు వారు నాటక విభాగంలో సాహిత్య పురస్కారాన్ని ప్రకటించారు. ఇఆయనకు సాహిత్య అకాడమి పురస్కారం లభించటం పట్ల పలువురు సాహితీవేత్తలు, నాటక కళాకారులు అభినందనలు తెలిపారు.

స్పందనకు 137 ఫిర్యాదులు

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్ : పల్నాడు జిల్లా నరస రావుపేట కలెక్టర్ కార్యాలయంలోని బీఆర్ అంబేద్కర్ స్పందన హాలులో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ వసంత బాబు నిర్వహించారు. ప్రజల నుంచి పెద్దఎత్తున వచ్చిన అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై వచ్చిన 137 అర్జీలను సంబంధిత శాఖలకు అందజేశారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహణకు విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్, ఏపీఎస్ఆర్టీసీ శాఖలవారు సమన్వయంతో సహకరించి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చూడాలని సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు మేరకు ఈ నెల 13నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న ఫైనాన్షియల్ లిటరసీ క్యాంపెయిన్‌కి సంబంధించి పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమ అనంతరం సుదూర ప్రాంతాల నుంచి స్పందన కార్యక్రమంలో అర్జీలు ఇవ్వడానికి వచ్చిన ప్రజలకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రత్నాకరం వరప్రసాద్, జీవీ సూర్యనారాయణ, రవిప్రసాద్ నాగలక్ష్మి తదితరులను జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ సత్కరించారు.

హత్యాచార నిందితులను శిక్షించాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం తీరు చూస్తుంటే బాలికలు, మహిళలపై హత్యాచారాలకు పాల్పడిన నిందితులకు కొమ్ముకాస్తుందన్న చందంగా ఉందని జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చేనేత వికాస విభాగం రాష్ట్ర చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. తాడేపల్లిలో కంటి చూపులేని మైనర్ బాలికను హతమార్చిన నేపథ్యంలో సోమవారం జనసేన నేతలు బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చిల్లపల్లి మీడియాతో మాట్లాడుతూ బాలికలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అదుపు చేస్తామని పేర్కొంటూ పలు చట్టాలను తీసుకువచ్చిన ప్రభుత్వం ఏ ఒక్క చట్టాన్ని అమలు చేయడంలేదని విమర్శించారు. సీఎం నివాసానికి కూతవేటు దూరంలోనే దుశ్చర్య జరగటం చూస్తుంటే నిఘా వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉందో అర్థమవుతుందని విమర్శించారు. తాడేపల్లి ప్రాంతంలో గంజాయి మత్తులో ఆకతాయిలు దారుణాలకు తెగబడుతున్నప్పటికీ సరైన చర్యలు తీసుకోకపోవడం పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. సీఎంకు మాత్రమే పోలీసులు రక్షణ కల్పిస్తారా? మహిళలకు భద్రత కల్పించలేరా? అని ప్రశ్నించారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, గుంటూరు జిల్లా కార్యదర్శి రావిరమా, ఎంటీఎంసీ ఉపాధ్యక్షులు శెట్టి రామకృష్ణ, తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, తాడేపల్లి మండల కార్యదర్శి అమ్మిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే యూటీఎఫ్ లక్ష్యం

విశాలాంధ్ర - నిజాంపట్నం : ఉపాధ్యాయుల సమస్యల పరి ష్కారమే యూటీఎఫ్ లక్ష్య మని నూతనంగా ఎన్నికైన యూటీఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షులు జె.వినయ్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్ బాపయ్య అన్నారు.ఆదివారం అద్దంకిలో జరిగిన బాపట్ల జిల్లా యూటీఎఫ్ ప్రధమ కౌన్సిల్ ఎన్నికలో నిజాంపట్నం మండలంలోని శారద నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న జె.వినయ్ కుమార్ అలాగే నిజాంపట్నం మండలంలోని బెల్లంకొండవారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న సిహెచ్ బాపయ్య లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన వీరిని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు దబ్బకూటి హరిబాబు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ గణేష్ రావు, ఉపా ధ్యక్షులు అబుల్ మాలిక్, లావణ్య కోశాధికారి రాజేష్, గౌరవాధ్యక్షులు వై.శ్రీనివాసరావు తో పాటు నిజాంపట్నం మండల శాఖ బాధ్యులు, ఉపాధ్యాయులు, తదితరులు అభినందనలు తెలియజేశారు.

దూకుడు పెంచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి

విశాలాంధ్ర - చీరాల : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని మొదటి ప్రాధాన్యత ఓటును వేసి ఆశీర్వదించాలని తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నీలం శ్యాముల్ మోజెస్ అన్నారు. చీరాలలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. తూర్పు రాయలసీమ నియోజకవర్గ పరిధిలోని ఉమ్మడి ప్రకాశం,నెల్లూరు,చిత్తూరు జిల్లాల అభ్యర్థిగా పోటీ చేస్తున్న నన్ను ప్రతి ఒక్కరు పెద్ద మనస్సుతో ఆశీర్వదించి పెద్దల సభకు వెళ్లే అవకాశం కల్పించాలని,ఉపాధ్యాయుల,ప్రభుత్వ ఉద్యోగుల, పట్టభద్రుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసికొనివెళ్లి పూర్తి స్థాయిలో పరిష్కరించే విధంగా అలుపెరుగని పోరాటం చేస్తానని అన్నారు.గత 35 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి, ప్రస్తుతం పాఠశాల కరెస్పాండెంట్ గా ఉంటూనే ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్నానని,ఉపాధ్యాయులు విజ్ఞతతో ఆలోచించి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి ఆశీర్వాదించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కిస్తే చర్యలు

విశాలాంధ్ర - అద్దంకి : పరిమితికి మించి ఆటో లలో జనా భాను ఎక్కించి రవాణా చేస్తే సంబంధిత ఆటోలను సీజ్ చేయ డంతో పాటు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అద్దంకి సీఐ రోశయ్య ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. సోమవారం ఆయన పట్టణంలోని ఎక్కువగా రద్దీఉండే భవానీ కూడలిలో ట్రాఫిక్ నియంత్రణపై చేపట్టవలసిన చర్యల గురించి సిబ్బందికి సూచనలు చేశారు. ఇటీవల కాలంలో ఆటోలలో పరిమితికి మించి మిరప కూలీలలను ఎక్కించుకొని రవాణా చేస్తూ ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అధిక స్పీడ్,ఓవర్‌లోడ్‌తో పోవుచున్న వాహనాలను గుర్తించి అపరాధ రుసుం విధిచాలని సిబ్బందికి సీఐ సూచించారు.

పేదలకు జీవనోపాధి కల్పనే రోటరీ ధ్యేయం

విశాలాంధ్ర - అద్దంకి : పేదలకు జీవనోపాధి కల్పించడమే రోటరీ క్లబ్ ధ్యేయమని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ గల్లా సాంబశివరావు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ,హైదరాబాదు డెక్కన్, రోటరీ క్లబ్ మంగ ళగిరి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గీతామందిరం నందు పేదలకు ఉచిత తోపుడు బండ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. పదిమంది లబ్ధిదారులకు రూ.1.50 లక్షల విలువ గల తోపుడు బండ్లను పంపిణీ చేశారు. తోపుడు బండ్లతో చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవన ప్రమాణాలను పెంచుకోవాలని సాంబశివరావు సూచించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు,కార్యదర్శి చిన్ని మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : పార్టీ బలోపేతానికి యువత ముందుకు రావా లని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని చింతపల్లిపాడు గ్రామానికి యువత ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలని, ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ విధానాల పట్ల ఉన్న కంపెనీలు పక్క రాష్ట్రాలకు తరలివెళ్లిపోవడంతో యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోవడం జరుగుతుంది అన్నారు. మరలా యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలన్న, రాష్ట్రానికి కొత్త కంపెనీలు తీసుకురావాలన్న అది ఒక చంద్రబాబు నాయుడు కే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో అలపర్తి నాగాంజనేయులు మందలపు వెంకట్ సాయి రావుల భవాని శంకర్, వెంకటకృష్ణ చైతన్య జంపని గోపి, జంపని తేజ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గుళ్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది ఎస్ఐ కొండారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నగరం మండలం అనగానివారిపాలెం గ్రామానికి చెందిన అనగాని మంగారావు (57) వెల్డింగ్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు ఈ క్రమంలో ఉదయం 11 గంటల సమయంలో అతని షాప్ ఎదురుగా రోడ్డు దాటుతున్న సమయంలో రేపల్లె వైపు నుండి వేగంగా వస్తున్న ఏపీ 07 డిఈ 1777 హోండా షైన్ వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాల్య వివాహాలపై పోక్సో కేసు నమోదు చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : బాల్య వివాహాలు జరిగితే తక్షణమే పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. బాల్య దశలోనే వివాహాలు చేసుకుని గర్భిణీలైన వారితో సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల జీవితాలను నాశనం చేసే బాల్య వివా హాలను నిర్మూలించాలని చెప్పారు. బాల్య వివాహాలను సమూలంగా అరికట్టడానికి అధికారులు సమన్వయంతో కృషిచేయాలని ఆదేశించారు. బాలికల హక్కులు పరిరక్షి ంచాల్సిన బాధ్యత మహిళాశిశు సంక్షేమశాఖ అధికారు లదేనన్నారు. సమాజానికి మేలుచేయడం మానేస్తే బాలల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందన్నారు. కౌమార దశలోని కిశోర బాలికలు గర్భిణీలుగా మారడంతో రక్తహీనత, పోషణ లోపానికి గురౌతున్నారని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. అత్యంత ప్రమాదకర స్థాయిలో వారి ఆరోగ్యపరిస్థితి ఉండడంపై ఆరాతీశారు. అధికారులు, అంగన్వాడి కార్యకర్తలు, ఏ.ఎన్.ఎమ్.లు, మహిళా పోలీసులు పర్యవేక్షణ లేకపోవడంతోనే కౌమా రదశ బాలికలు ప్రమాదం అంచులో ఉన్నారని తెలిపారు. బాల్య వివాహాలకు డ్రాప్ అవుట్స్ మరో కారణమని ఆమె చెప్పారు. అధికారులు, సిబ్బంది చేతగాని తనం బాలికల భవిష్యత్తు నిర్వీర్యం అవుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో బాల్యదశలోనే గర్భిణీలుగా నమోదైన 30 సచివాలయాల పరిధిలోని అధికారులు, సిబ్బందితో కలెక్టర్ సమీక్షించారు. అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయకపోతే చట్టపరంగా కఠినమైన చర్యలు తీసు కుంటామని మందలించారు. 43 కేజీల బరువున్న 13 ఏళ్ల బాలిక గర్భిణీగా ఉండడం, 16 ఏళ్ల వయస్సున్న మరో బాలిక గర్భం దాల్చడంపై కలెక్టర్ తీవ్రంగా స్పం దించారు. బాల్య వివాహాలు జరుగుతుంటే సంబంధిత ప్రాంతంలోని సచివాలయాల సిబ్బంది నమోదు చేయడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితులను చూసి అధికారులు సిగ్గుపడాల న్నారు. నూతన జిల్లాగా ఆవిర్భవించిన ఏప్రిల్-4వ తేదీ నుంచి జిల్లాలో జరిగిన వివాహాలపై సర్వే చేయాల న్నారు. వివాహాలు చేసుకున్న వారి ఆధార్ కార్డులను పరిశీలించి ఆన్‌లైన్లో పక్కాగా నమోదు చేయాలని సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు. బాల్య దశలో గర్భిణీలైన వారి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా సంబంధిత సి.డి.పి.ఓ.లకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళాశిశు సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖ అధికారుల పనితీరు బాగోలేదని ఆమె తీవ్రంగా అసంతృప్తి వ్యక్తంచేశారు. కాగితాలపై లెక్కలు చూపడం మాని క్షేత్రస్థాయిలో వాస్తవికతను నమోదు చేయాలని ఆమె పలు సూచనలు చేశారు. సమాజంలో మార్పువచ్చేలా వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏ.ఎన్.ఎమ్.లు ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమశాఖ పి.డి. కె. ఉమ, వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ విజయమ్మ, సి.పి.ఓ. జి. భరత్, డి.ఎల్.డి.ఓ.లు, ఐ.సి.డి.ఎస్. సి.డి. పి.ఓ.లు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏ.ఎన్. ఎమ్.లు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది యోగక్షేమాలకు అధిక ప్రాధాన్యం: ఎస్పీ

విశాలాంధ్ర - బాపట్ల : సాయుధ పోలీసు బలగాలలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వ హించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో సోమవారం నిష్ణాతులైన వైద్య బృందంచే 121 మంది సాయుధ పోలీసు సిబ్బందికి షుగర్, బిపి, హృదయ సంబంధిత సమస్యలకు, కంటి సమస్యలకు, దంత సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతు్ల సాయుధ పోలీసు బలగాలకు ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న తర్ఫీదు అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకునేందుకు దోహదం చేసే మొబలైజేషన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ోలీస్ శాఖలో సాయుధ పోలీసు బలగాలు అత్యంత క్రియాశీలకమైన బాధ్యత వహిస్తాయ న్నారు. సాయుధ బలగాలు పోలీస్ శాఖకు భుజాలు లాంటివని పోలీస్ ఉద్యోగం అంటే ఏ క్షణంలో ఏ బందోబస్తు వస్తుందో తెలియదని, క్షణం తీరికలేని విధులు సమయాభావం లేని ఆహారపు అలవాట్లు, నిద్రలేమి కారణాల వలన సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి చుపించలేకపోతున్నరని తెలిపారు. ఏ సమస్య లేకపోయినప్పటికీ దీర్ఘకాలంలో అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సిబ్బంది యోగక్షేమాలకు ముఖ్య ప్రాధాన్యత ఇస్తామన్నారు. సిబ్బంది అందరూ కూడా మంచి ఆహారపు నియమాలు పాటిస్తూ, వ్యాయామాలు చేస్తూ ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఏం.డి.హెచ్ ప్రేమ్ కుమార్, అడ్మిన్ ఆర్ఐ ఎల్. మన్మధరావు , వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్ నాయక్, సిబ్బంది సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధితోనే బీసీల అభ్యున్నతి: కేసన

విశాలాంధ్ర - బాపట్ల : బీసీలలో అత్యధికంగా ఆర్థికంగా వెనుక బడిన తరగతుల వారు ఉన్నారని, వారి అభ్యున్నతి ఆర్థికాభివృ ద్ధితోనే సాధ్యమవుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం బాపట్ల నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవులు మహేష్ ఇటీవల అనారోగ్యం పాలై శస్త్రచికిత్స జరగటంతో బెస్తపాలెంలోని మహేష్ ఇంటికి సోమవారం వెళ్లి తనను కేసన శంకరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, పలువురు నేతలు పరామ ర్శించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన బీసీ సంఘ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీలు అభ్యున్నతికి పారిశ్రామిక రంగం ప్రధాన పాత్ర పోషిస్తుందని, యువత పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన రుణాలను బీసీ వర్గాల ప్రజలకు పెద్ద ఎత్తున కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ఇటీవల లేఖ ద్వారా పలు అంశాలపై విన్నపాలను తెలిపానన్నారు. పరిశ్రమల ఏర్పాటులో బీసీలు ముందుకొచ్చేందుకు వారికి రాయితీ రుణాలను పెద్ద ఎత్తున కల్పించే దిశగా ప్రభుత్వం ప్రణాళికను రూపొందిస్తుందన్నారు. ఈ సంవత్సరం ప్రకటించే పారిశ్రామిక విధానములో దీనిపై సముచిత స్థానాన్ని కల్పించాలని ముఖ్యమంత్రికి, బీసీ మంత్రులకు, పెద్దలకు వినతి పత్రాలు అందజేశామని, వారు సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలో ప్రభుత్వం ప్రకటించనున్న పారిశ్రామిక విధానంలో బీసీలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్వారక, జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, జిల్లా కార్యదర్శి మారం రవికుమార్, బాపట్ల నియోజకవర్గం అధ్యక్షుడు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ఎస్పి రాజు, నేతలు తురక గోపి, ఏడుకొండలు, వీరమల్లు చంద్రమౌళి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుకు గురైన మహిళ ఆరోగ్యం మెరుగు

విశాలాంధ్ర - జె.పంగులూరు : ఉపాధి హామీ పనికి వెళ్లి పాము కాటు గురైన మహిళ ఆరోగ్యం మెరుగుపడి సోమవారం డిశ్చార్జ్ అయ్యారని ఏ.పీ.ఓ. లక్ష్మీదేవి తెలిపారు. మండలంలోని కశ్యాపురం గ్రామానికి చెందిన కూకట్ల పద్మావతి శనివారం ఉపాధి హామీ పనికి వెళ్లి పాముకాటుకు గురైన విషయం పాఠకులకు తెలిసిందే. పాము కాటు వేసిన వెంటనే ఆమెను అద్దంకిలోని వైద్యశాలకు తరలించారు. ఆమెకు డాక్టర్లు వెంటనే స్పందించి, వైద్యం అందించడంతో ఆమె కోలుకుంది. ఆమెను సోమవారం ఇంటికి తీసుకు వచ్చినట్లు లక్ష్మీదేవి తెలిపారు. పద్మావతికి వైద్యం నిమిత్తం ఆయన ఖర్చులు మొత్తం ప్రభుత్వం నుండి ఇప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఆమెకు అయిన ఖర్చుల వివరాలు బిల్లు రూపంలో తీసుకురావాలని తెలియజేశామని చెప్పారు. బిల్లులు తీసుకువచ్చిన వెంటనే ఎంపీడీవోతో మాట్లాడి బిల్లులు మొత్తం డిపార్ట్మెంట్ ద్వారా చెల్లించేందుకు కృషి చేస్తానని లక్ష్మీదేవి తెలిపారు.

శ్రీ భార్గవిలో జాగృతి సాంస్కృతిక పోటీలు

విశాలాంధ్ర - కర్లపాలెం : రామకృష్ణ మిషన్ 125వ ఆవిర్భావ వార్షికోత్సవం పురస్కరించుకుని శ్రీ భార్గవి హైస్కూల్‌లో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో జాగృతి సాంస్కృతిక పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. పోటీలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రధమ ,ద్వితీయ ,తృతీయ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు తిమ్మరాజు వెంకట సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించికుని పట్టువదలకుండా చదివితే చివరకు విజయం సాదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, భార్గవి హైస్కూల్ అధినేత పేరాల వెంకట సురేష్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం: మంత్రి

విశాలాంధ్ర - బాపట్ల : సీఎం వైఎస్ జగన్మోహ న్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని రాష్ట్ర సంఘీక సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగా ర్జున తెలిపారు. వేమూరు నియోజకవర్గం అమర్తలూరు మండలం ఇంటూరు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధి బ్రౌచర్‌ను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్న ప్రజలకు ఏ లోటు లేకుండా ఎన్నికల్లో చెప్పిన ప్రతి హామీని అమలు చేస్తున్నారన్నారు. ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పలు పథకాలు ప్రవేశపెట్టి ప్రోత్సహిస్తు న్నారన్నారు. ప్రజలు గుర్తించుకోవాలని టీడీపీ అబద్ధపు ప్రచారాలను వినోద్దని మంత్రి మేరుగ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి వీరభద్ర శ్రీనివాస్ రెడ్డి, వేమూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బొల్లి ముంత ఏడుకొండలు, మండల పార్టీ ప్రెసిడెంట్ ఎలవర్తి సురేష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చందోలు డేవిడ్ విజయకుమార్, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ ఓలేటి శివాజీ, సర్పంచ్ మొద్దు జీవమనీ, ఎంపీటీసీలు తమ్మ వెంకట్ రెడ్డి,ఆనంద్ కుమారి, మాజీ సర్పంచ్‌లు బట్టు మోషే, కంభం శ్యామ్యూల్, రాష్ట్ర లీగల్ సెల్ సెక్రెటరీ గుమ్మ డి రవిరాజ్ సొసైటీ ప్రసిడెంట్ కాజా శంకర్ రెడ్డి, నాయకులు దంతు కృష్ణారెడ్డి, భీమవరపు సాంబిరెడ్డి, దుండి రాఘవరెడ్డి, అవుతు ముత్తారెడ్డి తదితరులున్నారు.

తాడేపల్లి ప్యాలెస్ నుంచే వివేకా హత్య డైరెక్షన్: టీడీపీ

విశాలాంధ్ర - బాపట్ల : తాడేపల్లి ప్యాలెస్ నుంచే వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు డైరెక్షన్ జరిగిం దని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ ముఖ్యనాయకులతో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేగేశన మాట్లాడుతూ నాడు హత్య జరిగిన సమయంలో జగన్మోహనరెడ్డి అనేక డ్రామాలు ఆడి ఆ నేపం టీడీపీ మీద నెట్టి రాజకీయంగా బాగా లబ్ధి పొందారన్నారు. జగనసుర రక్తచరిత్ర బహిర్గతం అనే పుస్తకం గత రెండురోజులుగా సోషల్మీడియాలో హల్చల్ చేస్తుందన్నారు. స్వయంగా వివేకానందరెడ్డి కూతురు జగన్మోహనరెడ్డి చెల్లెలు ప్రభుత్వం మీద నమ్మకం లేదని ఇసును పక్క రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారంటే నిజం ఏమిటో రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. నిందితులను కాపాడటానికి వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తుందన్నారు. సీబీఐ కోర్టులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి నిందితులు ఎంత పెద్దవారైన శిక్ష పడేవిధంగా చూడాలని నరేంద్రవర్మ కోరారు. ప్రజలు ఇప్పటికైన వాస్తవాలు గ్రహించి ఈ క్రూర ప్రభుత్వాన్ని తరమికొట్టాలన్నారు.ఈ సమావేశంలో పట్టణపార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు, పరీదుమిస్తాన్, అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా అందరికీ పథకాలు

విశాలాంధ్ర - కర్లపాలెం : అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మండలంలోని పేరలి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి ప్రభుత్వ పథకాల లబ్ధిని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు సీఎం జగన్ పాలను గుర్తించుకోవాలని రాబోవు కాలంలో మరింతగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యారం వనజ, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ మల్లెల ఆదాం, ఉపాధ్యక్షులు కాగిత బుల్లియ్య, మండల కన్వీనర్ దొంతిబోయిన సీతారామిరెడ్డి,మాజీ ఎంపీటీసీ గొర్రెముచ్చు మీరయ్య, నాయకులు సలగల ధరేంద్ర తదితరులున్నారు.

తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లోనే వివేకాహత్య: టీడీపీ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మాజీ ఎంపీ వివేకానంద రెడ్డి హత్య మొత్తం తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లోనే జరిగిందని అర్థం అవుతుంది, కావున సీబీఐ, కోర్టులు నిష్పక్షపాతంగా వ్యవహరించి నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని లేని పక్షంలో నరహంతకులు విచ్చలవిడిగా రెచ్చిపోతారని పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ కోవెలమూడి రవీంద్ర(నాని) అన్నారు. స్థానిక పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో జగనాసుర రక్తచరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ గత రెండు రోజుల నుండి సోషల్ మీడియాలో జగనసుర రక్తచరిత్ర బహిర్గతం అనే బుక్ హల్చల్ చేస్తోందని, ఆ బుక్‌లో వివేకానంద రెడ్డి హత్య గురుంచి పూర్తి వివరాలు ఉన్నాయి. నాడు ఆ హత్య జరిగిన సమయంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి అనేక డ్రామాలు ఆడి, ఆ నెపం టీడీపీ మీద నెట్టి రాజకీయంగా బాగా లబ్ది పొందారు. స్వయంగా వివేకానంద రెడ్డి కూతురు, జగన్మోహన్ రెడ్డి చెల్లె ఈ ప్రభుత్వం మీద నమ్మకం లేదని ఆ కేసును ప్రక్క రాష్టనికి బదిలీ చేయాలని కోరారంటేనే నిందితులను కాపాడటానికి ఈ ప్రభుత్వం ఎంతగా కృషి చేస్తోందో అర్థం అవుతోందని అన్నారు. తాడేపల్లి ప్యాలస్ పక్కన జరిగిన యువతి హత్య జగన్ పాలనా వైఫల్యానికి నిదర్శనమని, తాడేపల్లి కేంద్రంగానే గంజాయి, డ్రగ్స్ వినియోగం జరుగుతుంది అని, మాదక ద్రవ్యాలకు యువత బానిసలు అవ్వటం వల్లే హత్యలు, అత్యాచారాలు పెరిగాయి అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, టీడీపీ నాయకులు లాల్ వజీర్, మానం శ్రీను, కురంగి శ్రీను, గుడిపాటి రమేష్, ఉప్పుటూరి పేరయ్య, ఆదం షా, షాహిద్ బాబు, కన్నసాని బాజీ, లామ్ నవమి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

అదనపు పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

విశాలాంధ్ర - బాపట్ల : ఎన్నికలు నిర్వహణకు మూడు అదనపు పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చెప్పారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో జిల్లాలో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయ నియోజకవర్గ స్థాయిలో ఎన్నికలు నిర్వహించడానికి 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో గ్రాడ్యుయేట్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించడానికి 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 1400 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాల్లో అదనంగా మరొక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేశారన్నారు. చీరాల మండలంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించడానికి మరో రెండు పోలింగ్ కేంద్రాలను వేటపాలెం మండలంలో మరొక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపనున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీ శివ జ్యోతి, ఎన్నికల సుపరిండెంట్ సుశీల, బహుజన సమాజ పార్టీ ప్రతినిధి కాగిత కోటేశ్వరరావు, సి.పి.ఐ పార్టీ ప్రతినిధి జెల్డి భాగ్యశ్రీధర్, సి.పి.ఎం పార్టీ ప్రతినిధి జి.గంగయ్య, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి జి.వి.ఎల్.మోహన్ గౌడ్, టి.డి.పి పార్టీ ప్రతినిధి బి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులను నిలదీసిన లబ్ధిదారులు

విశాలాంధ్ర - భట్టిప్రోలు : లేఅవుట్‌లలో మౌలిక వసతులు కల్పించకుండా ఇళ్ళు కట్టుకోమంటే ఎలా కట్టుకోవాలంటూ మండల కేంద్రమైన భట్టిప్రోలు లేఅవుట్‌లోని లబ్ధిదారులు అధికారులను నిలదీశారు. ఇంటి నిర్మాణాలు ప్రారంభించని వారికి గృహ నిర్మాణ శాఖ అధికారులు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాట్‌కు వెళ్ళేందుకు రోడ్డు లేదు. విద్యుత్ సౌకర్యం పూర్తి కాలేదని నీటి సౌకర్యం లేకపోతే ఇంటి నిర్మాణం ఎలా చేపట్టాలని లేఅవుట్‌కు వచ్చిన అధికారులను నిలదీశారు. మౌలిక వసతులు కల్పిస్తామని యుద్ధ ప్రాతిపధికన పైపులైన్లు ఏర్పాటు చేయిస్తామని అధికారులు తెలిపారు. డ్వాక్రా సంఘాల ద్వారా రూ. 35 వేలు ఋణం ఇస్తున్నందున సద్వినియోగపరచుకుని త్వరితగతిన ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలని గృహనిర్మాణశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ డిఈ ఎ.రవికుమార్, ఎఈ రావూరి సౌమ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, సచివాలయ ఉద్యోగులు సంబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

షాదీ తోఫా ఆంక్షలు ఎత్తివేయాలి

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : షాదీ తోఫా పథ కంకు విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు పఠాన్ రాజేష్ డిమాండ్ చేశారు. బాపట్ల పట్టణంలోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ భవనంలో ముస్లిం మహిళల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ రూ.50వేలు ఇచ్చారని నేడు వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రూ. 1 లక్ష ఇస్తానని చెప్పి ముస్లిం మహిళలను మోసం చేశారని విమర్శించారు. వధువు, వరుడు 10వ తరగతి చదివి ఉండాలనే నిబంధన పెట్టడం విచారకరం అన్నారు. ముస్లింలలో పదవ తరగతి వరకు చవిన మహిళలు ఎంతమంది ఉంటారో ఆలోచించాలని పేర్కొన్నారు. ఆంక్షలను తొలగించి పేదలకు తప్పనిసరిగా రూ.1లక్ష ఇవ్వాల్సిందే అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రాంబాబు, దండు రేణుక, షేక్ మజుర్నిష, షేక్ బాజి, రేష్మ, ఫాతిమా, సాగర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 4143 కేసులు పరిష్కారం



విశాలాంధ్ర - బాపట్ల : ఈ నెల 11వ తేదీన జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో జిల్లాలో 4143 కేసులు పరిష్కారం జరిగాయని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారానికి చక్కని వేదిక జాతీయ మెగా లోక్ అదాలత్ అన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌లో జిల్లా పోలీస్ అధికారులు విచారణ దశలో ఉన్న కేసులు, కోర్టులో ట్రయిల్ పెండింగ్ ఉన్న కేసులలో కక్షిదారులు మధ్య రాజీ కుదిర్చి, కొన్ని కేసులలో ముద్దాయిలకు అపరాధ రుసుముతో 838 క్రిమినల్ కేసులు, 3304 పెట్టీ కేసులతో కలిపి 4143 కేసులను పరిష్కారం జరిగాయన్నారు. సిబ్బంది ప్రణాళికబద్ధంగా ముందు నుంచి లోక్‌అదాలత్‌లో రాజీ చేయదగిన కేసులలోని కక్షిదారులకు నోటిసులు జారీచేసి ఇరుపక్షల వారికి కౌన్సిలింగ్ నిర్వహించి సమస్యను పరిష్కరించి స్నేహపూర్వక వాతావరణం తీసుకువచ్చి జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. నిరంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో క్రిమినల్ కేసులు, కుటుంబ కలహాలు, భార్య భర్తల గొడవలు, రోడ్డు ప్రమాదలు, ట్రాఫిక్ కేసులు కేసులలోని ఇరుపక్షాల కక్షిదారులు కేసులను కోర్టలలో పరిష్కరించుకోవడనికి ఎక్కువ కాలపరిమితి పడుతుంటుందన్నారు. ఈ నేపథ్యంలో అలాంటి కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకుంటే బాధితులకు సకాలంలో సత్వర న్యాయం చేకూరుతుందన్నారు. పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ముగిసిన నాగార్జున వర్సిటీ క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో గత కొన్ని రోజుల నుంచి జరుగుతున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో చోడవరం ఆర్. వి.ఆర్ అండ్ జెసి ఇంజనీరింగ్ కళాశాల జట్టు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కళాశాల జట్టుపై 33 పరుగుల తేడాతో విజయం సాధించింది. సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లో సత్తెనపల్లి ప్రగతి డిగ్రీ కాలేజ్ ఏఎన్‌యూ సీపీఈఈఎస్ జట్లు పోటీపడగా ప్రగతి డిగ్రీ కళశాల జట్టు విజయం సాధించి మూడోస్థానం కైవసం చేసుకుంది. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు, వైస్‌ప్రెసిడెంట్ దొప్పలపూడి రామ్మోహన్, ప్రిన్సిపాల్ ఎస్.కె. నజీర్‌లు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ అంకమ్మచౌదరి, పి.గౌరీశంకర్, సెల్ సెలక్షన్ కమిటీ మెంబర్స్, పాతూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.